క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్ మహానగర పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈనెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. హనుమకొండలోని గోపాల్‌పూర్, కేయూసీ, యాదవనగర్, బాలసముద్రం, న్యూ శాయంపేట, సోమిడి, వడ్డెపల్లి సబ్‌స్టేషన్ ప్రాంతంలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. నక్కలగుట్ట సబ్ స్టేషన్ ప్రాంతంలో ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు, మచిలీబజార్, ఆర్ఈసీ, మడికొండ, రాంనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వరంగల్‌లోని ఆజంజాహి మిల్, స్టేషన్ రోడ్డు, ఖిలా వరంగల్ రోడ్డు, శంభునిపేట, ఉర్సు, దేశాయిపేట, కేఎంసీ సబ్‌స్టేషన్ పరిధిలో, చమన్, భోగేశ్వరాలయం, గణేష్ కాలనీ, ఫిల్టర్‌బెడ్, బ్యాంక్ కాలనీ, ధర్మారం ప్రాంతంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వారు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కేసీ క్యాంప్, నారాయణనగర్, ఎర్రగట్టు గుట్ట, కిట్స్ కళాశాల ప్రాంతం, హసన్‌పర్తి, రామారం, భీమారం, చింతగట్టు, కోమటిపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

విద్యుత్ లైన్‌పై కొమ్మలు తొలగించండి



ఖిలా వరంగల్: వరంగల్ 39వ డివిజన్ విద్యానగర్ కాయిత బ్రాహ్మణ వీధిలో విద్యుత్ లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం గాలిదుమారంతో కురిసిన వర్షానికి విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి తగిలి నిప్పు రవ్వలు రాలిపడ్డాయని తెలిపారు. దాంతో తమ ఇళ్లల్లోని గృహోపకరణాలు, ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, కంప్యూటర్లు కాలిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. తీగలను సరిచేయాలని విద్యుత్ అధికారులకు గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు.

ప్రొఫెసర్ ఫారూఖీకి నివాళి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ బాటనీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్ఎం ఫారూఖీ (88) ఈనెల 15న అనారోగ్య సమస్యలతో హనుమకొండలో మృతిచెందారు. 1996వ సంవత్సరంలో ప్రొఫసర్‌గా ఆయన ఉద్యోగ విరమణ పొందారు. కాగా, బాటనీ విభాగంలో ఫారూఖీ చిత్రపటానికి శుక్రవారం పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో రిటైర్డ్ ప్రొఫెసర్లు ఎస్.రాంరెడ్డి, ఎన్.రామస్వామి, క్రిస్టోఫర్, కృష్ణారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ముస్తఫా, ఆచార్య షమిత, బాటనీ విభాగం అధిపతి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

గూడ్స్ రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



మృతుడు

కాశిబుగ్గ: గూడ్స్ రైలుకింద పడి ఓ వ్యక్తి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం హనుమకొండ బాలసముద్రానికి చెందిన శివరాత్రి సురేష్(30) వ్యక్తిగత, ఇతర కారణాలతో కాజీపేట – వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య కాజీపేట నుంచి డోర్నకల్ వైపు వెళ్తున్న ఓ గూడ్స్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ కేసు నమోదు చేసి సురేష్ మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ వివరించారు. మృతుడి వివరాలకు వరంగల్ జీఆర్పీ స్టేషన్‌లో లేదా 94403 61941, 87126 58585 నంబర్లలో సంప్రదించాలని సీఐ నరేష్ సూచించారు.

జీటీ ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి..

కాశిబుగ్గ: జీటీ ఎక్స్‌ప్రెస్ రైలు (12616) కింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాజీపేట – వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య మెడికేర్ హాస్పిటల్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు 35 – 40 సంవత్సరాల మధ్య వయస్సు మృతుడి ఎడమ చేతిపై రాజమ్మ (ఇంగ్లిష్‌లో), కుడి చేతి తెలుగులో అమ్మ అని, ఇంగ్లిస్‌లో కల్యాణి అని పచ్చబొట్టు ఉందని పేర్కొన్నారు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు ఎస్సై ఐలయ్య కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు వివరించారు. వివరాలకు 99594 25483, 871265 8585 నంబర్లలో సంప్రదించాలని సీఐ కోరారు.

అకాలం వర్షం.. తడిసిన ధాన్యం

- ఆందోళనలో రైతులు



హసన్‌పర్తి: వర్షానికి తడిసిన ధాన్యం



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు



ఖిలా వరంగల్: ధాన్యం కొనుగోలు కేంద్రంలో..

హసన్‌పర్తి: రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దైంది. ఇప్పటికే కాంటా వేసి బస్తాల్లో నింపిన ధాన్యం కూడా తడిసిపోయింది. వంగపహాడ్, మల్లారెడ్డిపల్లి, పెగడపల్లి, ముచ్చర్ల, నాగారం కొనుగోలు కేంద్రాల వద్ద ఇదే దుస్థితి నెలకొంది. వంగపహాడ్, మల్లారెడ్డిపల్లి, పెగడపల్లి పీఏసీఎస్ పరిధిలో సుమారు మూడువేల కాంటా వేసిన, ఆరబెట్టిన వరిధాన్యం బస్తాలు తడిసిపోయాయి. ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం సందర్శించి మాట్లాడారు. షరతులు లేకుండా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు.

న్యాయం చేయాలని అన్నదాతల వేడుకోలు

ఖిలా వరంగల్: జిల్లాలోని పలు మండలాల్లో గురువారం సాయంత్రం కురిసిన వర్షం అన్నదాతలను ఆగం చేసింది. కల్లాల్లోకి వరద నీరు చేరడంతో ధాన్యం తడిసిపోయింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లలో జాప్యంతో ధాన్యం తడిసి ఆర్థికంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్ష ప్రభావం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినా పీఏసీఎస్ సొసైటీలు, మెప్మా, ఐకేపీలు ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయలేదని వాపోయారు. నర్సంపేట, వర్ధన్నపేట, వరంగల్ డివిజన్లలో మరింత ఎక్కువగా నష్టం వాటిల్లిందని, ఆరబోసిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయిందని రైతులు కన్నీరు మున్నీరయ్యారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఖిలా వరంగల్: ఈనెల 18న వరంగల్ భద్రకాళి రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో జరగనున్న ఆరాధన ఉత్సవాలను విజయవంతం చేయాలని భారతీయ విశ్వకర్మ పరిషత్ వ్యవస్థాపకుడు ఆచార్య రాచమల్ల పున్నమాచార్యులు, కాలజ్ఞాన ప్రచార భారతి తెలుగు విభాగం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండోజు వీరాచారి, ప్రధాన కార్యదర్శి రాచమల్ల శంకరాచార్యులు కోరారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆరాధనోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రపంచశాంతి కోసం అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ వ్యవస్థాపకుడు ఆచార్య రాచమల్ల పున్నమాచార్యుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఆరాధన ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో పొన్నగంటి రవీంద్రచారి, వెలిషోజు తిరుమలచారి, కంచర్ల సదానందం, మడిపోజు సంతోష్ పాల్గొన్నారు.

హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళిరోడ్డులోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ అధ్యక్షుడు మారేడోజు సదానందచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాలలో భాగంగా ఉదయం సుప్రభాతసేవ, మధ్యాహ్నం 12గంటలకు స్వాములవారి ఆరాధన, అనంతరం అన్నప్రసాదాల వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

నేడు మాత 1008వ జయంతోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్‌రావు

వరంగల్: ఆర్యవైశ్యుల కులదైవం, లోకమాత విశ్వజనని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో 1008వ జయంతిని పురస్కరించుకుని ములుగు రోడ్డు సమీపంలోని వాసవి మాత దేవాలయంలో జయంతి ఉత్సవాలను శనివారం నిర్వహించనున్నట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు తెలిపారు. దేవాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 6గంటల నుంచి పూజా కార్యక్రమాలు, కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వాసవి మాత దర్శన్ పెనుగొండకు వెళ్లి వచ్చిన సుమారు 1500 మంది వాసవి మాత భక్తులకు వాసవి రత్న అవార్డులను ప్రదానం చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోనుపునూరి వీరన్న, వాసవి మాత దర్శన్ ప్రోగ్రాం కన్వీనర్లు మల్యాల వీరమల్లయ్య, అంచూరి శ్రీనివాస్, వాసవి మాత దేవాలయం చైర్మన్ తాటికొండ సత్యనారాయణ, అడ్డగుడి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

ఎంజీఎం: కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని ఉద్యోగ సంఘం ప్రతినిధులు కోరారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించేందుకు శుక్రవారం నగరానికి వచ్చిన వైద్యారోగ్యశాఖ కమిషనర్ కర్ణన్‌ను సంఘం నాయకులు కలిసి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు ఇంతవరకు అందలేదని, అవి అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఏడు నెలల పీఆర్సీ ఎరియర్స్ కూడా అందించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్ ఖన్నా, ఆర్‌బీఎస్‌కె వైద్యుల సంఘం అధ్యక్షుడు గుండా రవీందర్, కోశాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్, డైక్ మేనేజర్ అనిల్‌కుమార్, సైకాలజిస్టు ప్రశాంత్ పాల్గొన్నారు.

పిల్లల్లో దేశభక్తి పెంపొందించాలి



మాట్లాడుతున్న సంజీవ

హన్మకొండ చౌరస్తా: బాల్యం నుంచే పిల్లల్లో దేశభక్తి, సంస్కారం, మంచి అలవాట్లను అలవర్చాలని, అప్పుడే వారు మంచి పౌరులుగా ఎదుగుతారని రిటైర్డ్ ప్రొఫెసర్ సీహెచ్.సంజీవ తెలిపారు. భారత్ వికాస్ పరిషత్ (ఓరుగల్లు) హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో కాకాజీకాలనీలోని శ్రీవివేకానంద నిలయంలో 'దేశభక్తి – కుటుంబ వ్యవస్థ' అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు వికాస్ పరిషత్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. కుటుంబ వ్యవస్థ, నైతిక విలువల గురించి ఆయన వివరించారు. బీవీపీ శాఖ అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి వెంకట్‌రెడ్డి, భారత్ వికాస్ పరిషత్ బాధ్యులు చంచల్ అగర్వాల్, వీసీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

డీకేనగర్‌లో వరదనీరు తొలగింపు



జేసీబీతో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

ఖిలా వరంగల్: గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన భారీ వర్షానికి వరంగల్ 40వ డివిజన్ డీకేనగర్ (దొడ్డి కొమురయ్య) కాలనీ వరద ముంపునకు గురైంది. ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిత్యావసరాలు తడిసి ముద్దాయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం జేసీబీ యంత్రం సహాయంతో డ్రెయినేజీల్లో పూడికతీసి వరద నీరు ముందుకు వెళ్లేలా బల్దియా సిబ్బంది చర్యలు తీసుకున్నారు. పారిశుద్ధ్య పనులను స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి పరిశీలించారు. కార్యక్రమంలో డీకే నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కుండే రాజు, ప్రధాన కార్యదర్శి పోలెపాక మల్లేశం, బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.

స్టూడెంట్స్ వెల్ఫేర్ సెంటర్ డైరెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ



కేయూ క్యాంపస్: కేయూలో స్టూడెంట్స్ వెల్ఫేర్ సెంటర్ డైరెక్టర్‌గా కామర్స్ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్ శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అమరవేణి, కుక్టా బాధ్యులు శ్రీధర్‌కుమార్ లోథ్, చీకటి శ్రీనివాస్ అభినందించారు.

ఐటీఐలో ప్రవేశాలకు ఆహ్వానం

వరంగల్ / హన్మకొండ అర్బన్ : వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2024లో ప్రవేశాలకు జూన్ 10వ తేదీలోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్, హనుమకొండ ప్రభుత్వ ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాల్ జి.సక్రు ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్ సెక్రటేరియల్ అసిస్టెంట్, వెల్డర్, డ్రాఫ్ట్‌మెన్ (సివిల్), ఎలక్ట్రానిక్, మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, రిఫ్రిజిరేషన్ /ఎయిర్ కండిషనింగ్ టెక్నీషియన్ కోర్సులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. http://iti.telangana. gov.in వెబ్‌సైట్‌లో తమ వ్యక్తిగత మొబైల్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఇందులో 20శాతం సీట్లు ఐఎంసీ ఫీజు పేమెంట్ సీట్లు ఉన్నాయని, అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రకటనలో కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాళోజీ సెంటర్: బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకంలో భాగంగా 1, 5వ తరగతుల్లో షెడ్యూల్ కులాల విద్యార్థుల అడ్మిషన్లకు జూన్ 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1వ తరగతికి 60, 5వ తరగతికి 62 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే ఈ పథకానికి అర్హులని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.2లక్షలకు మించరాదన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి కార్యాలయం వరంగల్, నర్సంపేటలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు 93463 74583, 95500 78045, 97011 98330 నంబర్లలో సంప్రదించాలని కోరారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళలకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి: గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు వివిధ అంశాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ రవి తెలిపారు. టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీ పార్లర్‌లో 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన 18 – 45 ఏళ్ల వయస్సు గల నిరుద్యోగ మహిళలు అర్హులని పేర్కొన్నారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన వారికి శిక్షణ కాలంలో ఉచిత వసతితో పాటు భోజన సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. ఆసక్తి గల వారు 4 పాస్‌సైజ్ ఫొటోలు ఆధార్, రేషన్‌కార్డుతో పాటు విద్యార్హత ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలతో సంస్కృతి విహార్, హసన్‌పర్తిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98493 07873 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి

ఖిలా వరంగల్: అత్తారింటికి వచ్చిన ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ నగరంలోని శంభునిపేట విశ్వనాథ కాలనీలో జరిగింది. ఎస్సై గోవర్ధన్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా మునుగోడుకు చెందిన ఓరగంటి రాఘవేందర్(23)కు ఏడు నెలల క్రితం విశ్వనాథ కాలనీకి చెందిన రాజేశ్వరితో వివాహం జరిగింది. ఓటు వేసేందుకు ఈ నెల 13న మునుగోడు నుంచి రాజేశ్వరి పుట్టింటికి వచ్చింది. భార్యను తీసుకెళ్లేందుకు భర్త రాఘవేందర్ గురువారం ఉదయం అత్తారింటికి వచ్చాడు. సాయంత్రం భారీ వర్షం కురవడంతో గుడిసెకు బిగించిన సీలింగ్ ఫ్యాన్ అతని చేతికి తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై కుప్పకులాడు. గమనించిన భార్య, అత్తామామ వెంటనే ఆటోలో అతన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందాడు. మృతుడి తండ్రి ఓరగంటి సాయిలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

భారీ వాహనాలతో ఇక్కట్లు



మడికొండ: మడికొండ – ధర్మసాగర్ రోడ్డులో భారీ వాహనాల రాకపోకలతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇరుకుగా ఉన్న ఈ దారిలో రోడ్డు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. భారీ వాహనాలు గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారు. ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. శుక్రవారం రెండు లారీలు ఎదురుకావడంతో ట్రాఫిక్ స్తంభించింది.

బాధిత మహిళలకు అండగా సఖి



మడికొండ: అవగాహన కల్పిస్తున్న సభ్యులు



హన్మకొండ చౌరస్తా: మాట్లాడుతున్న వినీల

మడికొండ: బాధిత మహిళలు, బాలికలకు సఖి సెంటర్ అండగా ఉంటోందని నిర్వాహకులు తెలిపారు. మహిళలకు చట్టాలపై కాజీపేట మండలం టేకులగూడెం గ్రామంలోని మహిళలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి, కేసు వర్కర్ హరిత పాల్గొని సఖి సెంటర్ ముఖ్య ఉద్దేశాలు, గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచార బాధితులకు రక్షణ కల్పించడానికి సఖి సెంటర్ పనిచేస్తోందని వివరించారు. సఖి సెంటర్ 24గంటల పాటు పని చేస్తుందని, ఆపద సమయంలో 0870 2452112, లేదా 181 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్‌చేసి తక్షణ సహాయం, రక్షణ పొందాలని చెప్పారు. కార్యక్రమంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

హన్మకొండ చౌరస్తా: వరకట్న, లైంగిక, ఇతర వేధింపులకు గురవుతున్న బాధిత మహిళలు, బాలికలకు సఖి వన్‌స్టాప్ సెంటర్ అండగా నిలబడుతోందని సెంటర్ కేస్ వర్కర్ వినీల తెలిపారు. గుడిబండల్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు కారణాలతో విడిపోయే భార్యభర్తలకు కౌన్సెలింగ్ ద్వారా ఒక్కటి చేయడం, లైంగిక వేధింపులకు పాల్పడితే న్యాయపరమైన సాయాన్ని సఖి అందిస్తోందని వివరించారు. మహిళలకు రక్షణ కల్పించడం కోసం సఖి సెంటర్ పనిచేస్తోందని, సమస్యలపై 0870 – 2452112, లేదా టోల్‌ఫ్రీ నంబర్ 181కు ఫోన్ ద్వారా తెలియవచ్చని అన్నారు. సమావేశంలో పారామెడికల్ సిబ్బంది సరిత, ఆర్‌పీ రమాదేవి పాల్గొన్నారు.

స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలి



సర్టిఫికెట్ అందజేస్తున్న వెంకటనారాయణ

హన్మకొండ అర్బన్: యువత స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు వచ్చి రక్తదానం చేసి తలసేమియా బాధితులను ఆదుకోవాలని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్ కోరారు. రెడ్ క్రాస్ పిలుపు మేరకు పర్వతారోహకుడు రాసమల్ల అఖిల్ తన పుట్టిన రోజు సందర్భంగా స్వచ్ఛందంగా ముందుకువచ్చి రెడ్ క్రాస్ కార్యాలయంలో శుక్రవారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ రక్తదానంతో తలసేమియా బాధితులకు పునర్జన్మ ఇవ్వొచ్చని పేర్కొన్నారు. తలసేమియా బాధిత చిన్నారులకు నిత్యం రక్తం అవసరముంటుందని వివరించారు. అనంతరం రక్తదాత అఖిల్‌కు సర్టిఫికెట్ అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, శాశ్వత సభ్యులు కన్నె రాజు, రాసమల్ల హారిక, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీకి పట్టభద్రులు అండగా నిలవాలి



ప్రచారం చేస్తున్న రావు పద్మ

హన్మకొండ: పట్టభద్రులు బీజేపీకి అండగా నిలవాలని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ కోరారు. నల్గొండ – వరంగల్ – ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ వరంగల్‌లోని రీజినల్ లైబ్రరీ, హనుమకొండలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో శుక్రవారం ప్రచారం చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు, విద్యార్థులను కలిసి ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు డి.అమర్‌నాథ్ రెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు తీగల భరత్‌గౌడ్, నాయకులు నర్మెట్ట శ్రీనివాస్, కడవేరు శ్రీనివాస్, ఆకాష్ సింగ్, సంపత్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, హరీష్, అనిల్ పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థికి టీడీపీ మద్దతు

నయీంనగర్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి టీడీపీ వరంగల్ పార్లమెంట్ కమిటీ మద్దతు తెలుపుతున్నట్లు పార్టీ రాష్ట్ర నాయకుడు గట్టు ప్రసాద్‌బాబు తెలిపారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు సాంబయ్య, రమేష్, శ్రీనివాస్, జనార్దన్‌రావు, వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గెలిపించాలి



మాట్లాడుతున్న రాజునాయక్

కేయూ క్యాంపస్: వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్నాని తనను గెలిపించాలని పట్టభద్రులను ఎమ్మెల్సీ అభ్యర్థి గుగులోతు రాజునాయక్ కోరారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎస్‌డీఎల్‌సీఈ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలు, నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే ప్రధాన ఎజెండాగా పాలకవర్గాలపై ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తానని తెలిపారు. ప్రశ్నించే యువ గొంతుకనైన తనను శాసనమండలికి పంపించాలని కోరారు. సమావేశంలో టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్, పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేయూ జేఏసీ వ్యవస్థాపక సభ్యులు విజయ్‌కన్నా, తెలంగాణ గ్రాడ్యుయేట్స్ వేదిక కన్వీనర్ వెంకటేశ్వర్లు, యూనివర్సిటీ గిరిజన శక్తి ఇన్‌చార్జ్ బానోతు దేవేందర్, బహుజన దళిత సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న జాఫర్, మెకానిక్‌లు

ఖిలా వరంగల్: వరంగల్ తిమ్మాపురం రోడ్డు లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎండీ.అబ్దుల్ రవూఫ్(32) శంభునిపేట ప్రధాన రహదారిపై బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని నగర బైక్ మెకానిక్‌లతో కలిసి ఆల్ టూవీలర్ మెకానిక్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ.జాఫర్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబీకులకు రూ.60వేలు అందజేశారు. బాధితులకు మెకానిక్ అసోసియేషన్ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బైక్ మెకానిక్‌లు ఫిరోజ్ అక్బర్, సలీం, ఇంతియాజ్ రాజు, అజయ్, అంజూమ్ వాహేద్ అలీ, రాము, సందీప్, సోని పాల్గొన్నారు.

సోమిడిలో వెంచర్లపై విచారణ జరిపించాలి

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి ఎస్సీ కాలనీ సమీపంలో వడ్డేపల్లి చెరువు శిఖం (ఎఫ్‌టీఎల్)లో వెంచర్లు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తులపై విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీ పెద్దలు కోరారు. ఈమేరకు బల్దియాలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి సమస్య తీవ్రతను వివరించారు. ప్రభుత్వ భూములు, ఎఫ్‌టీఎల్‌ను వెంచర్లు చేసి ఎస్సీకాలనీ వాసులకు ముురుగు సమస్యను పెంచుతున్న వారి వైఖరిపై విచారణకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.